

జ్యోతిరాదిత్యను కలిసిన రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు రామ్మోహన్ నాయుడు గత మంత్రివర్గంలో ఆ శాఖ మంత్రిగా పనిచేసిన జ్యోతిరాదిత్య సింధియాను న్యూఢిల్లీలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువ కప్పి సత్కరించారు. విమానయాన శాఖకు సంబంధించిన పలు అంశాలపై ముచ్చటించుకున్నారు.




కేబినెట్‌లో ఎవరికి ఖాయం?

- జిల్లా నుంచి ఒకరికే అవకాశమంటూ చర్చ
- రేసులో అచ్చెన్న, అశోక్, రవికుమార్, శిరీష
- అచ్చెన్నాయుడుకి మంత్రి పదవిపై సందిగ్ధత
- పార్టీ అధ్యక్షులుగానే కొనసాగిస్తారని ప్రచారం



అచ్చెన్నాయుడు





కూన రవికుమార్



బెందాళం అశోక్



గౌతు శిరీష

రాష్ట్ర కొత్త కేబినెట్ కూర్పుపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో, సిఎంతో పాటు ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు ఎవరనే అంశంపై అటు రాజకీయ పార్టీలు, ఇటు ప్రజల్లోనూ చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రివర్గంలో కేటాయింపులు ఉంటాయన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఎవరికి పదవులు దక్కుతాయనేది ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాజిక సమీకరణాలు, సీనియారిటీ, యువత, మహిళా కోటాలో తమకు అవకాశం లభిస్తుందని కొంతమంది ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. కేబినెట్‌లో బెర్తు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. కేబినెట్‌లో చోటు దక్కిన మంత్రులకు స్వయంగా చంద్రబాబు ఫోన్ చేస్తారన్న ప్రచారంతో ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది. మంత్రివర్గంలో బెర్తుల అంశం తేలకపోవడంతో బుధవారం ప్రకటిస్తారని వార్తలు రావడంతో నేతల్లో మరింత ఉత్కంఠ పెరిగింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఒక ఎంపీ స్థానంతో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. టిడిపి తరుపున గెలిచిన వారిలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు ఉన్నారు. బిజెపి తరుపున ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎన్.ఈశ్వరరావు విజయం సాధించారు. యువత, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పార్టీ అధిష్టానం ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. టికెట్ల కేటాయింపులోనూ అదే పద్ధతిని అనుసరించిన టిడిపి, కేబినెట్ కూర్పు ఆవిధంగానే చేయాలని భావిస్తున్నట్లుగా తెలిసింది. దీంతోపాటు సామాజిక సమీకరణాలనూ పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో పలువురు ఆశావహులు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

యువత కోటాలో ఎవరికి దక్కేను?

యువత కోటాలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పేరును ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇచ్ఛాపురం నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలవడం, క్లీన్ ఇమేజ్ ఉండడంతో ఆయనకు ప్రాధాన్యం ఇస్తారనే చర్చ నడుస్తోంది. ఆమదాలవలస నుంచి ఎన్నికైన కూన రవికుమార్‌కూ మంత్రి పదవి వస్తుందని ఆయన అనుచరులు ఆశిస్తున్నారు. 2014 ఎన్నికల్లో తొలిసారిగా గెలిచిన కూన రవికుమార్‌కు పార్టీ అధిష్టానం ప్రభుత్వ విప్ పదవి కేటాయించింది. దీంతో ఈసారీ తమ నేతకు అవకాశం దక్కవచ్చని ఆయన అనుచరులు భారీగా ఆశలు పెట్టుకుంటున్నారు. కూన రవికుమార్, బెందాళం అశోక్ ఇరువురూ కళింగ సామాజిక తరగతి కావడంతో, ఇద్దరిలో ఒకరికే పదవి వచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. బిసి మహిళా కోటాలో గౌతు శిరీషకు మంత్రి పదవి దక్కే అవకాశాలు లేకపోలేదనే చర్చ నడుస్తోంది. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరాచకాలపై ఎదురొడ్డి పోరాడడంతో ఒక మహిళగా తెగువ చూపారనే పేరు దక్కించుకున్నారు. తనపై, కార్యకర్తలపై కేసులు, కక్షసాధింపులకు పాల్పడినా వారి వెన్నంట ఉండి కేడర్‌ను కాపాడుకున్నారన్న పేరు అధిష్టానం దృష్టిలో ఉంది. జిల్లాలో సీనియర్లు మంత్రి పదవులు ఆశిస్తున్న తరుణంలో వివాదాలకు తావులేకుండా గౌతు శిరీషకు కేబినెట్‌లో బెర్తు కేటాయించే ఛాన్స్ ఉందన్న చర్చ జిల్లాలో సాగుతోంది.

అచ్చెన్నకు మంత్రి పదవిపై సందిగ్ధత

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రి పదవి దక్కడంపై సందిగ్ధత నెలకొంది. పార్టీలో సీనియర్ నేత, మూడు పర్యాయాల గెలుపు వంటి సానుకూల అంశాలున్నా, కొన్ని ప్రతికూల అంశాలూ లేకపోలేదు. కేంద్ర కేబినెట్‌లోకి ఎంపీ రామ్మోహన్ నాయుడుని తీసుకోవడంతో అచ్చెన్న అవకాశాలకు గండి పడుతుందన్న చర్చ నడుస్తోంది. మంత్రివర్గ కూర్పుపై పార్టీ పరిగణనలోకి తీసుకుంటున్న అంశాలూ అచ్చెన్నకు అవకాశాలు సన్నగిల్లే పరిస్థితి నెలకొంది. యువత, క్లీన్ ఇమేజ్ ఉన్న వారిని కేబినెట్‌లోకి తీసుకుంటామని చెప్పడంతో అచ్చెన్నాయుడుకి పదవి వస్తుందా? లేదా? అన్న ఆందోళన కేడర్‌లో నెలకొంది. రాబోయే పది, 15 ఏళ్ల పాటు రాజకీయాల్లో కొనసాగే సామర్థ్యమున్న వారికి అధిక అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో అచ్చెన్నకు ఛాన్స్ సన్నగిల్లుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాలనా విధుల్లో తలమునకయ్యే పరిస్థితులు ఉండే అవకాశమున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పార్టీ బాధ్యతలను చూసేందుకు అచ్చెన్నాయుడినే మళ్లీ అధ్యక్షులుగా కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్న చర్చ పార్టీలో నడుస్తోంది.



విజయ సంకేతాన్ని చూపిస్తున్న కాకినాడ ఆదిత్య విద్యార్థులు

ఇఎపిసెట్‌లో మెరిసిన విద్యార్థులు

- ఇంజినీరింగ్‌లో సతీష్ కుమార్ 81వ ర్యాంకు
- అగ్రికల్చర్‌లో పణవ్‌సాయికి 12వ ర్యాంకు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్, టెక్కలి, పోలాకి

ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎపి ఇఎపిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. ఇంజినీరింగ్, వ్యవసాయం విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్‌లో జలుమూరు మండలం కరవంజకు చెందిన చింతు సతీష్ కుమార్ 81వ ర్యాంకు సాధించాడు. తండ్రి బుచ్చన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తల్లి రమాదేవి గృహిణి. శ్రీకాకుళం నగరం ఇందిరానగర్ కాలనీ పరిధిలోని గోవిందనగర్‌కు చెందిన మావూరు జశ్వంత్‌కు 84వ ర్యాంకు వచ్చింది. నరసన్నపేటలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన కోరాడ సాదీప్‌కు 124వ ర్యాంకు వచ్చింది. తండ్రి కోరాడ వైకుంఠరావు నరసన్నపేట మండలం కంబకాయ జెడ్‌పి హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. తల్లి దుర్గా భవానీ జలుమూరు మండలం అచ్యుతాపురం జెడ్‌పి హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కోటబొమ్మాళికి చెందిన సకలాబత్తుల సాయి బదరీష్‌కు 128వ ర్యాంకు దక్కింది. తండ్రి గుప్త వ్యాపారం చేస్తున్నారు. తల్లి శ్రీలక్ష్మి గృహిణి.

నరసన్నపేట మండలానికి చెందిన గొండు సాయిప్రణీత్ 411 ర్యాంకు సాధించాడు. సాయిప్రణీత్ ఆరు నుంచి పదో తరగతి వరకు నారాయణ స్కూల్‌లో చదివాడు. ఇంటర్మీడియట్ విశాఖపట్నం నారాయణ కళాశాలలో అభ్యసించాడు. తల్లిదండ్రులు ఇరువురూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. పోలాకి మండలం పోలాకి గ్రామానికి చెందిన పాలబోయిన ప్రణయ్ 743వ ర్యాంకు సాధించాడు. ప్రణయ్ ఇంటర్మీడియట్ విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో చదివాడు. వీరికి నారాయణ కళాశాల డిజిఎం హనుమంతురావు, ఎజిఎం ఐ.రమేష్, ప్రిన్సిపాల్ ఎ.రమేష్ అభినందనలు తెలిపారు.



అమృత



సాయి ప్రణీత్



సుధాన్వి

అగ్రికల్చర్ విభాగంలో సత్తా చాటిన విద్యార్థులు

టెక్కలి పట్టణానికి చెందిన మల్లిపెద్ది ప్రణవ్‌సాయి అగ్రికల్చర్ విభాగంలో 12వ ర్యాంకు సాధించాడు. ప్రణవ్‌సాయి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్థానికంగా ఉన్న పాఠశాలల్లో, ఆరు నుంచి పదో తరగతి వరకు వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదివారు. ఇంటర్మీడియట్ రాజమండ్రిలోని శశి కళాశాలలో చదివారు. ఇటీవల తెలంగాణ ఎంసెట్‌లో ప్రణవ్‌సాయి 62 ర్యాంకు సాధించగా, నీట్ ఫలితాల్లో 430వ ర్యాంకు సాధించాడు. ప్రణవ్‌సాయి తండ్రి మధుసూదనరావు వ్యాపారవేత్త కాగా, తల్లి సంతోషి జ్యోతిబాపూలే పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యా యురాలిగా పనిచేస్తున్నారు. ప్రణవ్ సాయిని కుటుంబసభ్యులతో పాటు పలువురు అభినందించారు.



సతీష్ కుమార్



ప్రణవ్ సాయి



హతిన్ సాయి

పాతపట్నం మండలం తీమరకు చెందిన బి.గౌతమికి 24వ ర్యాంకు దక్కింది. శ్రీకాకుళం నగరం బలగకు చెందిన జరుగుళ్ల నాగ కార్తీక్ 40వ ర్యాంకు సాధించాడు. కోటబొమ్మాళికి చెందిన గొల్లపల్లి రిజియాకు 55వ ర్యాంకు దక్కింది. శ్రీకాకుళం నగరం ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కింజరాపు సంజోగ్ నాయుడుకు 80వ ర్యాంకు వచ్చింది.

నరసన్నపేట మండలం సత్యవరానికి చెందిన తండారపు సుభాష్య 85వ ర్యాంకు దక్కింది. బూర్జ మండలం తోటాడకు చెందిన తోట సుచితకు 86వ ర్యాంకు, పొందూరు మండలం అచ్చిపోలవలసకు చెందిన గురుగుబెల్లి జై కిశోర్‌కు 89వ ర్యాంకు వచ్చింది.

సత్తాచాటిన 'కాకినాడ ఆదిత్య' విద్యార్థులు

ఇఎపిసెట్ ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థులు సత్తా చాట్టారు. భమిడిపాటి స్వర్ణశ్రీ 110.2012 మార్కులు సాధించి 459 ర్యాంకు దక్కించుకుంది. మాతా ప్రవళ్లిక 95.1873 మార్కులతో 1347వ ర్యాంకు వచ్చింది. పెద్దిన శరణ్య 93.6263 మార్కులు సాధించి 1457వ ర్యాంకు దక్కించుకుంది. ఈ ముగ్గురు ఇటీవల విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లోనూ మెరుగైన ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లేశ్వరరావు అభినందించారు.

'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

విశాఖపట్నం నారాయణ విద్యాసంస్థలో చదువుతున్న పలాసకు చెందిన పొట్నూరు హతిన్ సాయి, తమ్మినేని అమృత, కొమురు సుధాన్వి ఇఎపిసెట్ ఫలితాల్లో సత్తా చాటారు. హతిన్ సాయి 238వ ర్యాంకు, తమ్మినేని అమృత 284వ ర్యాంకు, కొమురు సుధాన్వి 732వ ర్యాంకు సాధించారు.




కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సొబగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఈనెల 12వ తేదీన చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనుండడంతో జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ముఖ్య అధికార కార్యాలయాలన్నీ విద్యుత్ వెలుగులతో ధగధగలాడాయి. జిల్లాపరిషత్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, డిఆర్‌డిఎ, ఆర్‌డిఒ, డ్వామా, ఎపిఎంఐపి, మైనింగ్, కోఆపరేటివ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సెట్‌శ్రీ, పర్యాటక శాఖ కార్యాలయాలతో పాటు అన్ని తహశీల్దార్, ఎంపిడిఒ, ఇతర ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు విద్యుత్ వెలుగులతో మిరమిట్లుగొలిపాయి.



డ్వామా కార్యాలయం

15న గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన జిల్లాలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈనెల 15న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గురుకుల విద్యాలయ సంస్థ జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దుప్పలవలస, కొల్లివలసలోని గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్స్ మ్యాథ్స్‌కు పురుష అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని తెలిపారు. మందస గురుకులంలో ఇంగ్లీష్, బోటనీ, పిజిటి మ్యాథ్స్, నందిగాంలో జెఎల్ మ్యాథ్స్‌కు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు పిజి, బిఇడి, టెట్ క్వాలిఫైడ్ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆదివారంపేటలో గల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయంలో ఈనెల 15న ఉదయం పది గంటల నుంచి డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 08942 279926, 9701736862, 9000314209 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం బుధవారం కొలువుదీరనుంది. పండుగ వాతావరణంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసారిపల్లిలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలంతా వీక్షించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం పది గంటల నుంచి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యక్ష ప్రచారాన్ని వీక్షించేందుకు అధికార యంత్రాంగం నిర్దేశిత ప్రదేశాల్లో తెరలపై వీక్షించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం రోటరీ క్లబ్‌లో, పలాసలో ఎమ్మెల్యే శిరీష నివాసంలో, టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో, పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం మండలం కె.ఎస్.ఎం ప్లాజాలో, శ్రీకాకుళం నియోజకవర్గంలో సింగుపురంలోని గాయత్రి కళ్యాణ మండపంలో, ఏడు రోడ్ల కూడలిలోని బాపూజీ కళామందిరంలో, ఆముదాలవలస నియోజకవర్గంలో ఆముదాలవలస గాంధీ విగ్రహం సెంటర్‌లో రైల్వేస్టేషన్ మెయిన్ రోడ్డు వద్ద, ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలంలోని కళ్యాణి వెంకటేశ్వర వేదికలో, నరసన్నపేట నియోజకవర్గంలో నరసన్నపేట జట్టు కళాశాల సంఘం యూనియన్ కార్యాలయంలో ఎల్ఇడి స్క్రీన్లు, టివిలను ఏర్పాటు చేశారు.

పార్టీలు సిద్ధాంతాలు వీడితే నష్టం

మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చాక సిద్ధాంతాలను విస్మరించి ఆర్థిక క్రమశిక్షణ తప్పితే ప్రజలు తప్పక బుద్ధి చెప్తారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ఓటమికి ఇదే కారణమన్నారు. వైసిపి ఓడిపోతుందని ఎన్నికలకు ముందే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు చెప్పానన్నారు. ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఎలా వచ్చిందో అని జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ నేతలు గత, వర్తమాన పరిణామాలను ఆకలింపు చేసుకుంటే భవిష్యత్ ఫలితాలను అంచనా వేయడం కష్టం కాదన్నారు. ప్రజామోదంతో విజయాన్ని అందుకున్న తర్వాత ప్రజలకు జవాబు దారీగా ఉండాలన్నారు. నియంతృత్వ విధానాలను అనుసరిస్తే ఏ రాజకీయ పార్టీకైనా ఇదే గతి పడుతుందన్నారు. సిద్ధాంతాల ఆధారంగా రాజకీయాలు నడవాలి తప్ప ఆర్థిక లావాదేవీలతో ఎల్లకాలం నడపలేమన్న విషయాన్ని గ్రహించాలన్నారు.



ఎన్‌డిఎ కూటమి శాసనసభాపక్ష సమావేశానికి జిల్లా నుంచి కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు హాజరయ్యారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష ముచ్చటించుకున్నారు.
- ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న శ్రీధర్

ప్రమాణ స్వీకార సభకు బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకార సభకు వేసిన బస్సులను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దానేటి శ్రీధర్ మంగళవారం ప్రారంభించారు. శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి బయలుదేరిన బస్సులకు జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలతో జనసేన గెలుపు దేశ చరిత్రలోనే గొప్పదన్నారు. రాష్ట్రంలో వైసిపి విముక్తి నినాదంతో వెళ్లిన పవన్‌ను ప్రజలు ఆదరించారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నో త్యాగాలు చేసిన పవన్ కళ్యాణ్ భవిష్యత్ తరాల నాయకుడు అని కొనియాడారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించేందుకు ఎన్‌డిఎ కూటమితో భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా పవన్‌ను ప్రశంసించారని గుర్తుచేశారు.



మాట్లాడుతున్న జడ్జి తేజచక్రవర్తి

అంటువ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి మల్ల తెలిపారు. టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాట్లాడుతూ ఘన వ్యర్థాలు నిర్వహణ అనేది ఘనవ్యర్థాలను సేకరించడం, శుద్ధి చేయడం, పారవేసే ప్రక్రియను సూచిస్తుందని అన్నారు. ఘన వ్యర్థాలను సరైన పద్ధతిలో ఉపయోగించకపోవడం కారణంగా పర్యావరణం కాలుష్యమై వివిధ రకాల అంటు వ్యాధులు ప్రబలుతాయని పేర్కొన్నారు. ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. సదస్సులో సర్పంచ్ గొండెలి సుజాత, టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డి.వి.వివేకానంద, మేజర్ పంచాయతీ కార్యనిర్వాహణాధికారి ఇఒపిఆర్‌డి బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న డైరెక్టర్

బాతుపురంలో సినిమా సందడి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బాతుపురంలో సినిమా సందడి నెలకుంది. మంగళవారం కెఎంసి ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తెలుగు ఒడియా ద్విభాష చిత్రం మీరాజ్ చిత్ర బృందం గ్రామంలో పలు సన్నివేశాలను నటీనటులపై చిత్రీకరించారు. ఈ సందర్భంగా సినిమా చిత్రీకరణ చూడటానికి గ్రామస్తులు ఎగబడ్డారు. అమాయకులైన ఇద్దరి వ్యక్తులకు సముద్రం నుంచి కొట్టుకు వచ్చిన ఒక 'మూట'వారి జీవితాలను రకరకాలుగా మలుపులు తిప్పుతూ ముందుకు సాగే సన్నివేశాలను చిత్ర దర్శకుడు విష్ణుదేవ్ తన బృందంతో చిత్రీకరించారు. స్థానిక సొండివీధి మంకీనమ్మ ఆలయం, ఇతర ఉద్దనం సముద్ర తీర గ్రామాల్లో పరిసరాల్లో చిత్ర నిర్మాణం చాలా వేగంగా జరుగుతుందని సినిమా నిర్మాత కె.సత్యభస్కర్ తెలిపారు. ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు కుమార్ నాయక్ సహకారంతో చిత్ర నిర్మాణం జరుగుతుందని చిత్ర దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రంలో నటీనటులుగా డాక్టర్ కుమార్‌నాయక్, రమేష్ యాదవ్, చైల్డ్ ఆర్టిస్ట్ కార్తీక్, హీరో చరణ్, మేకప్ తారా, ప్రొడక్షన్ మేనేజర్ తమాడ ప్రదీప్, కో-ఆర్డినేటర్ తామాడ శాంతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ శరత్, ఖలీల్ ప్రొడక్షన్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అండ

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులకు అండగా ఉంటూ నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడేది భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మాత్రమేనని జివిఎంసి కార్పొరేటర్ గంగారావు అన్నారు. మున్సిపాలిటీలోని చింతాడ పరిధిలో ఉన్న జిఎల్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు మంగళవారం నాలుగో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాలుగా పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత ఎస్ఎఫ్ఐకే దక్కిందన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలలు సజీవంగా ఉన్నాయంటే ఎస్ఎఫ్ఐ పోరాటాల వల్లనే అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని చదువుతో వెనుకబాటు తనం, దోపిడీ, అజ్ఞానం, అన్యాయం వంటివి బయటకు తెచ్చే విధంగా ఉండాలన్నారు. నానాటికీ విద్యా ప్రమాణాలు దిగజారుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలనైనా నిర్భయంగా చెప్పుకునే ఒకే ఒక్క సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసిన ఘనత ఈ సంఘానికే దక్కుతుందన్నారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని మున్ముందు విద్యార్థుల హక్కుల కోసం మరెన్నో పోరాటాలు చేసి కాపాడుకుంటామని అన్నారు. విద్య వైజ్ఞానిక శిక్షణా తరగతులను ప్రతిఒక్క విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు డి.చందు, సహాయ కార్యదర్శి సంతోష్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగారావు

బాబు ప్రమాణ స్వీకారానికి

తరలివెళ్లిన కూటమి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 12న జరగనున్న ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి ఇచ్ఛాపురం నుంచి రెండు బస్సులు బయలుదేరాయి. పట్టణంలో బస్టాండ్ కూడలి నుంచి వెళ్తున్న బస్సులకు పలాస ఆర్‌డిఒ సుదర్శన్‌దొర మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, లోపింట్ పద్మనాభం, శాడి సహదేవ్‌రెడ్డి, దక్కత విశ్వనాథ్‌రెడ్డి. దట్టి శ్రీను, ప్రకాష్‌నాయక్, డిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని టిడిపి నాయకులు అన్ని గ్రామాల నుంచి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి అమరావతి బయలుదేరారు పాత్రునువలస, నైర, వెంకటాపురం పంచాయతీల నుంచి టిడిపి నాయకులు ప్రత్యేక బస్సులో అమరావతికి ప్రయాణమయ్యారు.

ఆమదాలవలస : చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి నియోజకవర్గంలోని పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు ఐదు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు, ఆరు ప్రయివేటు బస్సులు, 100, ప్రయివేట్ ట్రావెల్స్‌లో యలుదేరి వెళ్లారు.


ఇచ్ఛాపురం : జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ సుదర్శన్‌దొర

నౌపడ : సంతబొమ్మాళి మండలంలో నౌపడ, మర్రిపాడు, భావనపాడు, మూలపేట, సంతబొమ్మాళి తదితర ప్రాంతాలకు చెందిన టిడిపి నాయకులు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి అమరావతి బయలుదేరి వెళ్లారు. పెద్దసంఖ్యలో వాహన శ్రేణులల్లో అభిమానులు బయలుదేరి వెళ్లారు. మరోవైపు జనసేన నాయకులు కణితి కిరణ్ కుమార్ ఆధ్వర్యాన జనసైనికులు తరలివెళ్లారు.

పలాస : చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆధ్వర్యాన కూటమి నాయకులు బయలుదేరారు. ఆయనతో పాటు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, గూన మన్మథరావు, వంకల కూర్మారావు ఉన్నారు.

పాతపట్నం : చంద్రబాబు ప్రమాణస్వీకారానికి టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి ఆధ్వర్యాన కూటమి నాయకులు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు సైలాడ సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు : చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఎంపిడిఒ త్రివిక్రమ్‌రావు, ఇఒపిఆర్‌డిల పర్యవేక్షణలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులో కూటమి నాయకులు అమరావతికి బయలుదేరి వెళ్లారు.

టిడిపి అరాచకాలను అరికట్టాలి

పోలాకి: మండలంలో టిడిపి కార్యకర్తలు చేస్తున్న అరాచకాలను అరికట్టాలని ఎంపిపి ప్రతినిధి, వైసిపి నాయకులు ముద్దాడ భైరాగినాయుడు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చీడివలస పంచాయతీ పరిధిలోని జిల్లేడి, మాకివలస గ్రామాలకు సిసి రహదారి వేసి మూడేళ్ల పూర్తయ్యిందన్నారు. దాని అంచనా విలువ చేసే పనులు వివరాలతో రోడ్డు ప్రారంభంలో శిలాఫలకాలు ఏర్పాటు చేశామని తెలిపారు. టిడిపి విజయం తరువాత రాత్రి పూట శిలాఫలకాన్ని కూలదోశారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని సూచించారు.

అచ్చెన్నాయుడును కలిసిన యువకులు

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు అమరావతిలో కోటబొమ్మాళికి చెందిన యువత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బుధవారం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ప్రమాణస్వీకరం చేస్తున్న సందర్భంగా అమరావతి చేరుకున్న యువత అక్కడకు చేరుకొని ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బోయిన సత్యశ్రీనివాస్, బోయిన రుత్విక్, తంగుడు సునీల్, లొట్టి రాహుల్, ఎస్.లక్ష్మణరావు ఉన్నారు. అలాగే నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన కూటమి నాయకులు చంద్రబాబు ప్రమాణస్వీకరానికి ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు.


అచ్చెన్నాయుడుతో యువకులు

చంద్రబాబును కలిసిన ఎంజిఆర్

పాతపట్నం: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో పాతపట్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పాతపట్నం నియోజవర్గం సమస్యలపై అధినేత వద్దకు తీసుకెళ్లారు. దీంతో సుమారుగా అరగంటకు పైగా చర్చ సాగింది. అనంతరం విజయవాడలో జరిగిన కూటమి శాసనసభ అభ్యర్థుల సమావేశంలో పాల్గొన్నారు.


పాతపట్నం : పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోవిందరావు


నాయకులతో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

వైసిపి నాయకులతో జగన్ సమీక్ష

శ్రీకాకుళం రూరల్ : వైసిపి అధినేత, మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌లు, జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు మంగళవారం కలిశారు. జిల్లాలో ఓటమికి గల కారణాలను జగన్ అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, ప్రజా సమస్యలపై నిరతరం పోరాటం చేయాలని జగన్ సూచించారు.


శిరీషను సన్మానిస్తున్న బాబూరావు, తదితరులు

గౌతు శిరీషకు సన్మానం

పలాస : విజయవాడలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా విజయవాడ చేరుకొని గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు కొరికాన శంకర్, సాసుమాన చంద్రమౌళి, యవ్వరి మోహనరావు, తమ్మినేని గంగారాం తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గౌతు శిరీషను అభినందించారు.

అండర్-23 క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మైదానం అండర్-23 నార్త్ జోన్ క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొదటిరోజు క్రికెట్ పోటీలను ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.వి.నాగేశ్వరరావు ప్రారంభంచారు. మొదటి రోజు శ్రీకాకుళం-విశాఖ జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 273 పరుగులు చేసింది. తదుపరి 274 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు 31.1 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌట్ అయ్యింది. బుధవారం విజయనగరం, విశాఖ మధ్య మ్యాచ్ జరగనుంది.


నవధాన్యాలు పంపిణీ చేస్తున్న ఎపిఎం కూర్మారావు

నవధాన్యాల సాగుతో నేల ఆరోగ్యం

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో సభ్యులంతా అవగాహన పెంచుకొని ఖరీఫ్‌కు ముందుగా నవధాన్యాలు సాగు చేస్తే నేల ఆరోగ్యంగా ఉంటుందని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సేంద్రీయ వ్యవసాయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు యూరియా వాడకం తగ్గించే ఉద్దేశంతో ప్రతి రైతూ నవధాన్యాల సాగుతో పచ్చిరొట్ట ఎరువులు కలియ దున్నడం ద్వారా భూమి గుల్ల భారీ సారవంతం అవుతుందని అన్నారు. అలాగే పంటకు కావాల్సిన నీటిని పొలంలో నిల్వ ఉంచుకొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని వివరించారు. గ్రామాల్లో వెలుగు, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో నవధాన్యాలైన తొమ్మిది రకాల విత్తనాలను తొలకరిలో జల్లి, దమ్ము చేయడం ద్వారా నేలకు, పంటకు చాలా ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య సిబ్బంది క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రామప్పడు, సుభద్ర, చంద్రరావు, రమణ, తిరుపతిరావు, లక్ష్మి, చిరంజీవి పాల్గొన్నారు.


కోయిడ్యాన్స్ చేస్తున్న కళాకారులు

అంబరాన్నంటిన సంబరం

కవిటి: కవిటిలో మంగళవారం నిర్వహించిన చింతామణి అమ్మవారి సంబర మహోత్సవం అంబరాన్నంటింది. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దలతో పాటు రాజమండ్రి వారి రాధాగోపాలం నృత్యం, విశాఖపట్నం వారి తీన్మార్, గొండ్యాలపుట్టుగకు చెందిన రాజరాజేశ్వరి నాట్య కళా మండలికి చెందిన సినీ కోయి డ్యాన్స్, తగరపువలసకు చెందిన దాండియా నృత్యం, పార్వతీపురం నుంచి అఘోరాలు, ఎచ్చెర్ల నుంచి కోలాటం ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. ముఖ్యంగా బాణసంచా వెలుగులు, లైటింగ్ సెట్టింగ్‌లతో కవిటి శోభాయమానంగా మారింది. ఈ వేడుకను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో కవిటి కిటకిటలాడింది.

పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తా

కవిటి: దశాబ్దాలుగా బెంతుఒరియాలు ఎదుర్కొంటున్న సమస్యలను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అన్నారు. కవిటిలో బెంతు ఒరియాలు చేస్తున్న నిరాహార దీక్షలు 167వ రోజుకి చేరుకున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం దీక్షా శిబిరం వద్దకు చేరుకున్న లోల్ల రాజేష్ వారికి సంఘీభావం తెలిపారు. వారి సమస్యలు తెలుసుకుని తమ అధినేత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న రాజేష్

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: ఇటీవల రహదారి ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన నైదాన వెంకట లక్ష్మి కుటుంబ సభ్యులకు యువతరం సేవా సమితి ఆర్థిక సాయం అందించింది. ఆమె చికిత్స పొందుతున్న విజయనగరంలోని కాష్వి ఆస్పత్రికి మంగళవారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. గత నెల 25న జరిగిన రోడ్డుప్రమాదంలో ఆమె పైగా మొఖం నుజ్జు నుజ్జు అయిపోయింది. వైద్యం కోసం రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సభ్యులు ఆదుకోవడానికి ముందుకొచ్చారు. కార్యక్రమంలో చింత మురళి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి గొరకల సునీల్, అన్నపు లక్ష్మణరావు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తపురానికి చెందిన గాలి కృష్ణారావు కొద్ది రోజుల క్రితం బస్సు ఢీకొని రెండు కాళ్లను పోగొట్టుకున్నాడు. దీంతో పూట గడవడం కష్టంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న 1999లో ఈదుపురం హైస్కూల్‌లో చదువుకున్న పదో పూర్వ విద్యార్థులు రూ.7 వేలు ఆర్థికసాయం అందజేశారు.

16న వాకర్ ఇంటర్నేషనల్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 సెకండ్ క్యాబినెట్ సమావేశం ఈ నెల 16న విజయనగరంలో నిర్వహిస్తున్నట్లు మాజీ గవర్నర్ పి.జి.గుప్త తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్యాబినెట్ సమావేశం ఆహ్వానపత్రికను మంగళవారం విడుదల చేశారు. విజయనగరం బాలాజీ వాకర్స్ ఆధ్వర్యాన ప్రస్తుత గవర్నర్ జామి నారాయణ స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టార్ వాకర్సు అధ్యక్షులు రవిశంకర్, శాసపు జోగినాయుడు, ఇందిరా ప్రసాద్, లక్ష్మి, సంతోష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.


నాయకులను సన్మానిస్తున్న యువకులు

టిడిపి నాయకులకు సన్మానం

లావేరు: ఇటీవల సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎమ్మెల్యేగా నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. వీరి విజయానికి మండలంలో కీలక భూమిక పోషించిన టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొరలను లావేరుకు చెందిన గండి సురేష్ యువసేన సభ్యులు మంగళవారం సన్మానించారు. లావేరు పంచాయతీలో కూటమికి 700 ఓట్లు మెజార్టీ సాధించడంలో కష్టపడి పనిచేసిన నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎన్.త్రినాథ్, మాజీ సర్పంచ్ గండి పార్వతి, లంకలపల్లి జగ్గన్నదొరల కూడా సన్మానించారు. కార్యక్రమంలో సవాలపు రపు సురేష్, దావిడ్ గణేష్, అసిరినాయుడు, సిర్ల కృష్ణ, చిన్న చిరుత, మామిడి రామారావు, రేగిన కిరణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

హెచ్ఎంకు సత్కారం

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి ఎంపిపి స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిల్లంశెట్టి త్రినాథరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, త్రినాథరావులు హెచ్ఎంను మంగళవారం సన్మానించారు. విధినిర్వహణలో ఉపాధ్యాయుని పాత్రపై పలువురు సందేశాన్ని అందించారు. ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు హెచ్ఎం జన్ని రఘుపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి


సిద్ధు (ఫైల్)

మండలంలోని మూలసవలాపురానికి చెందిన యువకుడు తర్లాడ సిద్ధు (21) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. తెలంగాణా రాష్ట్రంలోని హైదరాబాదులో బిటెక్ చదువుతున్న సిద్ధు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థి కూన రవికుమార్‌పై అభిమానంతో ఆయన విజయానికి కృషి చేశారు. ఓట్ల లెక్కింపు అనంతరం హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో మార్గంమధ్య విశాఖపట్నంలో గుండెపోటు వచ్చి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. గతంలో సిద్ధు తండ్రి గ్రామ సర్పంచ్ తర్లాడ సుధాకర్ కూడా యుక్త వయసులోనే అనారోగ్యంతో మృతి చెందారు. ప్రస్తుత సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు మనవడు. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చీడివలసలో చోరీ

బూర్జ : మండలంలోని చీడివలసలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఎలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోడి అప్పలనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి తన ఇంటి ముందున్న గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వెనక వైపు గది నుంచి శబ్దం రావడంతో మెలకువ వచ్చిన అప్పలనాయుడు వెళ్లి చూశాడు. ఆ గదిలో ఉన్న బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా చూడగా నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెచ్‌సి సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంపై కూలిన చెట్టు

టెక్కలి : పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న దుకాణంపై మంగళవారం కూలింది. కొన్నేళ నుంచి చెట్టు అక్కడే ఉండడంతో కొమ్మ బలం తప్పి కూలింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. చెట్టు కూలే సమయంలో దుకానంలో యజమాని నీలిమ ఉన్నారు. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. చెట్టు కూలడంతో బడ్డీ దుకాణం పూర్తిగా ధ్వంసమైంది. సమీప ప్రజలు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : 33/11 కెవి సబ్-స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్-1 ఫీడర్ పరిధిలోని ఈ 13న ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు కారణంగా పొడవాటి స్తంభాలు వేయడం, తీగలు అమర్చడానికి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలంలోని నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


శాంతిస్వరూప్‌రెడ్డి

నౌపడ : ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు చేపడుతున్న నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సుభిక్ష పాలన ఏర్పడుతుందని టిడిపి యువ నాయకులు, రెడ్డిక కార్పొరేషన్ పార్లమెంటరీ చైర్మన్ సుగ్గు శాంతి స్వరూప్ అన్నారు. బుధవారం అమరావతిలో జరుగుతున్న కూటమి నాయకుల ప్రమాణ స్వీకారానికి కార్యకర్తలతో బయలుదేరిన సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రధానమంత్రి మోదీ సహకారం, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ రామ్మోహన్ నాయుడుకు అభినందనలు తెలియజేశారు. జిల్లా ప్రగతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ మేజర్ పంచాయతీలో టిడిపి నాయకుల ఆధ్వర్యాన అధికారులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. టిడిపి యువ నాయకులు సుగ్గు శాంతి స్వరూపరెడ్డి దగ్గరుండి కాలువల్లో పూడికలు తొలగించి, చెత్తను తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. వర్షాకాలంలో కాలువల్లో ఆటంకాలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి నాయకులు అధికారులను కోరారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య పనులను అధికారులు వేగవంతం చేశారు. అలాగే వీధి దీపాలు మరమ్మతులు, విరిగిన కుళాయి మరమ్మతులు త్వరితగతిని చేపట్టాలని టిడిపి నాయకులు కోరుతున్నారు. పనులను కర్రి బాలకృష్ణ, శంకర్, మహంతి రాజు పర్యవేక్షించారు.

వంజంగిలో అన్నదానం

ఆమదాలవలస : మండలంలోని వంజంగి ప్రధాన రహదారిపై ఉన్న ముకుంద తిరుమల ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అలంకరణ, విశేష దర్శనము, లక్ష్మీపద్మావతి వెంకటేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో వంజంగి గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర యువజన సంఘం సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

మొక్కుబడిగా మండల సమావేశం


సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

కవిటి: కవిటి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా సాగింది. ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి చాలామంది ప్రజా ప్రతినిధులు గైర్హాజరవ్వడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ముఖ్యంగా ఇటీవల విడుదలైన సాధారణ ఎన్నికల ఫలితాల ప్రభావం మండల సమావేశంపై స్పష్టంగా కనిపించింది. అదే విధంగా ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన ప్రగతిని, రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, తహశీల్దార్ లక్ష్మి, ఇఒపిఆర్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

అచ్చెన్న సోదరునికి అభినందనలు

కోటబొమ్మాళి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో, అలాగే కోటబొమ్మాళి మండలంలో టిడిపికి అత్యధిక మెజారిటీ రావడం, కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు భారీ మెజారిటీతో గెలిపొందడంతో మండలంలోని కురుడు పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు అభినందించారు. నాళ్ల ఆదినారాయణ (చిన్ని), టిఎన్‌టియుసి కార్యదర్శి నర్సింగరావు, బోర అప్పారావు పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్‌ను నిమ్మాడలో కలిసి మంగళవారం సన్మానించారు. అలాగే టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ నివాసానికి వెళ్లి ఆయనకు పూలమాల వేసి దుశ్శాలువ కప్పి సత్కరించారు. అనంతరం చంద్రబాబు ప్రమాణస్వీకారానికి అమరావతి బయలుదేరారు.

టిడిపితోనే నాయీబ్రాహ్మణులకు మేలు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గడచిన ఐదేళ్ల కాలంలో నాయీబ్రాహ్మణ కుటుంబాలకు నిర్లక్ష్యం చేస్తూ... వృత్తి సౌకర్యాలు లేకుండా చేసిందని టిడిపి నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ కుప్పిలి వెంకటరావు అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పార్టీ విజయానికి సాధికారిత కమిటీ తరపున ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో జరిగిన నష్టాలతో పాటు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని విస్తృత ప్రచారం నిర్వహించామని తెలిపారు. నాయీబ్రాహ్మణుల సమస్యలను సైతం మేనిఫెస్టోలో ఉంచారని గుర్తు చేశారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సాధికారిత కమిటీ సభ్యులు కుప్పిలి ఈశ్వరరావు, పొదలపు సీతారాం, జమ్ము రవికుమార్, కుప్పిలి నాగరాజు, చిగురువలస సింహాచలం, కామేశ్వరరావు పాల్గొన్నారు.